నీరు లేక వెలవెలబోతున్న చెరువులు

- సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతాంగం
- రబీపైనే రైతుల ఆశలు



నీరు లేక వెలవెలపోతున్న టీ.సంద్రపల్లె చెరువు

గోపవరం : వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరు లేక చెరువులు వెలవెలపోతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక రైతులు సాగు చేయలేదు. రబీపైనే ఆశలు పెట్టుకున్న రైతులు సాగునీరు అందక సాగు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాధారంపైనే ఈ ప్రాంత రైతులు పంటలు సాగు చేసేవారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాంత రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని బ్రహ్మంసాగర్ ద్వారా సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో కాలువలు తవ్వించారు. 2019కి ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రహ్మంసాగర్ ద్వారా సాగునీరు అందిస్తామని ఈ ప్రాంత రైతులకు హామీ ఇచ్చారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించారు. వరుసగా నాలుగేళ్ల పాటు బ్రహ్మంసాగర్ నీరు వచ్చాయి. దీంతో ఈ ప్రాంత రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో చెరువులన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వెంటనే బ్రహ్మంసాగర్ ద్వారా చెరువులకు నీరు అందుతాయన్న ఆశలు అడియాశలయ్యాయి.

ఆందోళనలో అన్నదాతలు

రబీ సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు బ్రహ్మంసాగర్ ద్వారా చెరువులకు సాగునీరు అందించలేదు. వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిన దాఖలాలు లేవు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రోజులను తలుచుకుంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు వచ్చినట్లైతే దాదాపు 5 వేల ఎకరాలకు పైగా రైతులు వరిపంటను సాగు చేయాల్సి ఉంది. కనీసం బ్రహ్మంసాగర్ ద్వారా అయినా చెరువులకు నీరు అందిస్తే కొంతలో కొంత అయినా పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. 2019కు ముందు వరుస కరువుతో ఈ ప్రాంత రైతులు ఎలాంటి పంటలు సాగు చేయలేక వ్యవసాయ కూలీ పనుల కోసం వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు కూడా అదే దుస్థితి గుర్తుకు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో భూగర్భజలాలు కూడా అడుగంటే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బ్రహ్మంసాగర్ నుంచి చెరువులకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

చెరువులకు నీరు అందించాలి



గత ప్రభుత్వంలో వరుసగా నాలుగేళ్ల పాటు బ్రహ్మంసాగర్ నుంచి చెరువులకు నీరు అందించారు. దీంతో సాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడలేదు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో చెరువులు నీరు లేక వెలవెలపోతున్నాయి. అధికారులు వెంటనే చెరువులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి.

- జి.వెంకటరెడ్డి, రైతు, రాచాయపేట, గోపవరం మండలం

రబీపైనే ఆశలు



సకాలంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పడకపోవడంతో ఎలాంటి పంటలు సాగు చేయలేదు. రబీపైనే ఆశలు పెట్టుకున్నాము. సమృద్ధిగా వర్షాలు పడకపోవడంతో ఆశలు సన్నగిల్లుతున్నాయి. గత ప్రభుత్వం బ్రహ్మంసాగర్ ద్వారా వరుసగా నాలుగేళ్ల పాటు చెరువులకు నీరందించారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నించడం లేదు.

- సి.హెచ్. నరసింహారెడ్డి, రైతు, రాచాయపేట, గోపవరం మండలం

నిర్లక్ష్యం వీడండి

డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ

గోపవరం : విధినిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడాలని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో ఖర్చు చేసిన రూ.6 కోట్ల నిధులకు సంబంధించి ఈ నెల 20వ తేదీ నుండి 19వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామసభలు నిర్వహించారు. అనంతరం సామాజిక తనిఖీ ప్రజావేదిక (ఓపెన్‌ఫోరమ్) నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పనులు, ఖర్చు చేసిన వివరాలను సామాజిక తనిఖీ సిబ్బంది నివేదికల ద్వారా చదివి వినిపించారు. 19వ విడత సామాజిక తనిఖీ జరుగుతున్నా ఇంకా అక్కడక్కడ ఫీల్డ్‌అసిస్టెంట్లు నిర్లక్ష్యధోరణి వ్యవహరిస్తుండటంతో మస్టర్లలో పొరపాట్లు జరుగుతూనే ఉన్నాయని అడిషనల్ పీడీ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని 7 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.10 వేలు సిబ్బంది ద్వారా రికవరీ చేసినట్లు ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా 3,996 జాబ్‌కార్డులు ఉండగా 6,408 కూలీలు ఉన్నట్లు ఆమె తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధుల ద్వారా పనులు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హసీనా, ఏపీఓ విజయమ్మ, క్వాలిటీ అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా సీతారామ కలశ మహోత్సవం

అట్లూరు : మండలంలోని రంగంపల్లికాలనీలో సీతారామ ఆలయ శిఖర కలశ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ శిఖల కలశ మహోత్సవానికి బద్వేలుకు చెందిన శతాధిక ప్రతిష్టాచార్యులు ఎం.రమేష్‌శర్మ ఆధ్వర్యంలో చలివేందులస్వామి, రామస్వామి, విష్ణుస్వామి, కోటేశ్వరశర్మ కలశ ప్రతిష్టా మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సీతారామ కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులతో పాటు మండలవ్యాప్తంగా భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : పట్టణంలోని యాచకులకు, సాధువులకు, యాచకులకు, వృద్ధులకు ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రాణదాత సేవా సమితి చైర్మన్ సునీల్ కుమార్ మాట్లాడుతూ కామనూరు గ్రామానికి చెందిన విషన్ వెంకటసుబ్బయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు శింగనమల వెంకటసుబ్బయ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. కొర్రపాటి వేణు, రాజు, న్యాయవాది సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

శివాలయంలో..

ప్రొద్దుటూరు : స్థానిక శివాలయంలో రెడ్ల సేవా సంఘం, రెడ్ల కల్యాణ మండపం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివోహం అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు భక్తులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో శివోహం అన్నదాన సేవా సమితి ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయ్‌కుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

హద్దులు చూపించండి

కలసపాడు : మండలంలోని చెన్నుపల్లె గ్రామంలో 2007లో సుమారు 40 మంది ఎస్సీ, బీసీ పేద రైతులకు 74 ఎకరాల భూమిని పట్టాలు ఇచ్చి పంపిణీ చేశారని, వారి పేర్లను రికార్డుల్లో ఎక్కించారు. అయితే భూములు సాగు చేసుకునేందుకు హద్దులు ఏర్పాటు చేయాలని చలానాలు కట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఇదే అదునుగా గ్రామంలోని పెద్ద రైతులు కొందరు తమ భూములు కబ్జా చేసి దున్నుకోవాలని చూస్తున్నారని, హద్దులు ఏర్పాటు చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై తహసీల్దారు మధురవాణిని వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారిశుద్ధ్యం పనుల పరిశీలన

ప్రొద్దుటూరు : మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటి చెత సేకరణ విధానాన్ని పర్యవేక్షించారు. మహేంద్రనగర్‌లో రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రమేశ్వరం ప్రాంతంలో తాగునీరు సరిగా రావడం లేదని ఫిర్యాదు చేయడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

విద్యా సామగ్రి పంపిణీ

మైదుకూరు : మండలంలోని ఎన్.యర్రబల్లె, గంగాయపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం విద్యా సామగ్రి అందజేశారు. విద్యా జ్యోతి కార్యక్రమంలో భాగంగా పలకలు, బలపాలు, పుస్తకాలు, పెన్నులు, రబ్బర్లు, మెండర్లు తదితర విద్యా సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలల ఉపాధ్యాయులు రామచంద్ర, పద్మజ, వీరభారతి అమ్మ సేవా సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పరిశీలన

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక సబ్‌జైల్‌లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి ఎస్ బాబాఫక్రుద్దీన్ సోమవారం పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 గురించి ఆయన వివరించారు. జైల్లో ఉన్న ఖైదీలకు ఏవైనా సమస్యలు వస్తే ప్రొద్దుటూరు మండల న్యాయసేవా అధికార సంస్థ, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కడప వారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

కలసపాడు : మండలంలోని శంఖవరం సమీపంలో కలసపాడు – పోరుమామిళ్ల ప్రధాన రహదారి మధ్యలో పురాతన కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే మట్టి కుంగడంతో ప్రమాదాలు జరుగుతాయనే ముందు జాగ్రత్త చర్యగా స్థానిక ఎస్‌ఐ చిరంజీవి సోమవారం జేసీబీ, ట్రాక్టర్లతో కల్వర్టు గుంతలను మట్టితో పూడ్చించారు. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా, ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్, కానిస్టేబుల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టార్చ్‌లైట్లు పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : రాత్రి సమయాల్లో నిల్వ నీటిలో ఉన్న లార్వాను గుర్తించేందుకు ఆరోగ్యశాఖ సిబ్బందికి టార్చిలైట్లను పంపిణీ చేశారు. కల్లూరు, కామనూరు పీహెచ్‌సీ పరిధిలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో సోమవారం ఆయిల్ బాల్స్ వేశారు. చెన్నమరాజుపల్లె, గోపవరం ప్రాంతాల్లో అధికారులు పర్యటించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ అప్కాస్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు, క్యాబ్ డ్రైవర్లకు టెక్నికల్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులు సరెండర్ లీవులు, డీఏలు, ఇంక్రిమెంట్లు అమలు చేయాలని కోరారు. కరోనాలో తీసుకున్న కార్మికులకు వేతనాలను పెంచడంతోపాటు సెలవులు, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు మంజూరు చేయాలని, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని పేర్కొన్నారు. ఆప్కాస్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సమ్మె అలవెన్స్‌లు ఇవ్వాలని తెలిపారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, చనిపోయిన 10 మంది కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల ఇన్సూరెన్స్ త్వరగా ఇప్పించాలని, పనిభారం తగ్గించాలని చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కార్మికులతో చర్చించి న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు చంటి, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పేదలు, దళితులు నివసిస్తున్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పేర్కొన్నారు. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమాన్ని సోమవారం భాకరాపేట దళితవాడ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాకరాపేట దళితవాడలో గత రెండు నెలలుగా తాగునీటి సరఫరా జరగడం లేదని, దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పట్టణంలో వార్డుల పర్యటన పూర్తయిన తర్వాత గుర్తించిన సమస్యలపై నవంబర్ 4వ తేదీన మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వెంకటరమణ, పి.వి.రమణ, పట్టణ నాయకులు మునిరత్నం, ఓబులపతి, నాగరాజు, సలోమి, కుమారి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త కోనేటి నరసింహారెడ్డి మృతికి నివాళి



కోనేటి నరసింహారెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కోనేటి నరసింహారెడ్డి(84) సోమవారం మృతి చెందారు. ఈయన రామేశ్వరం వీఆర్‌ఓగా పనిచేశారు. రైస్‌మిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా, సినిమా థియేటర్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. ఈయన హయాంలోనే పట్టణంలో మొదటి సారిగా తోడుదొంగలు అనే సినిమాను నేరుగా రిలీజ్ చేశారు. నరసింహారెడ్డి అన్వర్ థియేటర్ 20 సంవత్సరాలు, బీవీఎస్, బాలాజీ థియేటర్లను 10 ఏళ్ల లీజుకు తీసుకుని నడిపారు. ఈయనకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నరసింహారెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళి అర్పించారు.

కొండారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



కొండారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : మండలంలోని సన్నపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సోముల కొండారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆయన కుటుంబీకులను సోమవారం పరామర్శించారు.

కుటుంబ సభ్యులను ఓదార్చి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రఘురామిరెడ్డి, అగ్రహారం సొసైటీ మాజీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మిడుతూరు సర్పంచ్ చంద్ర తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీర జవాన్ కుటుంబీకులకు పరామర్శ



రాజేష్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం : చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల దాడిలో మృతి చెందిన బ్రహ్మంగారిమఠం మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన కొడవటిగంటి రాజేష్ కుటుంబీకులను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సోమవారం పరామర్శించారు. రాజేష్ మృతి చెందిన సమయంలో అందుబాటులో లేకపోవడంతో రాలేకపోయాయని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటా కోసం తమ వంతు చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం రాజేష్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పక్కగా నిర్వహించాలి

దువ్వూరు(చాపాడు) : నవంబర్ ఒకటో తేదీన జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీపై సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో 7,296 మంది పింఛనుదారులకు 110 మంది సచివాలయ సిబ్బంది రూ.3,05,55,000లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సిబ్బందికి కేటాయించిన మేరకు నవంబర్ 1న ఉదయం పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండాసవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని, జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని కోరారు. అలాగే ఎన్నికల్లో హామి ఇచ్చిన మేరకు తల్లికి వందనం ఎప్పుడు నుంచి అమలు చేయాలో స్పష్టమైన ఉత్తర్వు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభినయ్, సప్తగిరి, సునీల్, జయంత్, వరుణ్ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10–30 గంటలకు సభాభవనంలో జరుగుతుందని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. మండల అధ్యక్షురాలు తహసిన్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

రేపు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, సాయంత్రం 6 గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఉంటుందని వివరించారు. భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈఓ రామచంద్రాచార్యులు కోరారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

అట్లూరు : ప్రభుత్వ భూములు స్థానిక పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. సోవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్లూరు మండలం నల్లాయపల్లి రెవెన్యూ పొలంలో వందలాది ఎకరాలు బడానాయకులు ఆక్రమించుకున్నారని విమర్శించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని స్థానిక పేదలకు కమిటీ ద్వారా పంపిణీ చేయలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రమణయ్య, గురమ్మ, సుహాసిణి, సుబ్బద్ర పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మైదుకూరు : రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.రాహుల్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు రాజసింహ నరేంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వై.రాహుల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు తల్లికి వందనం పథకం ప్రకటించినా, ఇంతవరకూ అమలుచేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుపై స్పష్టమైన ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎంపీడీఓలకు సన్మానం

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు బదిలీపై వెళ్లిన, ఇక్కడకు వచ్చిన ఎంపీడీఓలను సన్మానిస్తున్నట్లు ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి తెలిపారు. చాపాడు ఎంపీడీఓగా పని చేస్తున్న శ్రీధర్ నాయుడు మైదుకూరుకు, అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఎంపీడీఓ వీర కిశోర్ చాపాడు మండలానికి బదిలీ అయ్యారన్నారు. ఈ క్రమంలో వారిని సన్మానిస్తున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లె బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన 47 టపాసుల అంగళ్లపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ గంగయ్యకు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. నాయకులు ఓబులేసు, జయరాజ్, రమేష్, బయన్న మాట్లాడుతూ టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో టీ బంకులు, ఫేస్ జూనియర్ కాలేజీ, చైతన్య స్కూల్ ఉన్నాయన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని అన్నారు. దుకాణాదారులందరూ సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలకు టపాసులు విక్రయించే అవకాశాలు ఉన్నాయన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులను ఆదుకుందాం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి




తెలుగుగంగ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బి.కోడూరు : మండలంలోని రైతాంగం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని బ్రహ్మంసాగర్ నుంచి 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి బొక్కినేరు ద్వారా ఎల్ఎస్‌పీ ప్రాజెక్టుకు 200 క్యూసెక్కుల నీటిని అందించి ఎడమ కాలువ పరిధిలోని అన్ని ఆయకట్టు చెరువులకు నీరు అందించి పంటలు సాగు చేసుకునేలా చూడాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి తెలుగుగంగ సీఈ శ్రీనివాసులు, ఎస్ఈ వెంకట్రామయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం మండల కేంద్రమైన బి.కోడూరులో రైతులు ఇప్పటి వరకు కేవలం 6 చెరువులకు ఎల్ఎస్‌పీ నీరు వచ్చి చేరిందని, మిగతా 13 చెరువులకు నీరు అందాల్సి ఉందని, నీటిని విడుదల చేస్తే ఆయకట్టు కింద పంటలను సాగు చేస్తామని రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా అందుకు స్పందించిన ఎమ్మెల్సీ.. జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులు పంటలు సాగు చేసుకునేందుకు 20 రోజులలోపు నీరు అందిస్తే పంటలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం బ్రహ్మంసాగర్ ఎనిమిదిన్నర టీఎంసీల నీరు నిల్వ ఉందని, అలాగే ఇన్‌ఫ్లో 2 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుందని, ఈ ఇన్‌ఫ్లో ఇంకో నెల రోజులు కొనసాగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాబట్టి అవుట్‌ఫ్లో 700 క్యూసెక్కులు విడుదల చేసి త్వరగా చెరువులకు నీరు అందిస్తే రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని, ఆలస్యంగా నీటిని అందిస్తే ఉపయోగకరంగా ఉండదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన అధికారులు రెండు, మూడు రోజుల్లో పరిశీలించి నీటిని విడుదల చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, సింగిల్‌విండో అధ్యక్షులు ఓ.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బి.కోడూరు : బి.కోడూరు మాజీ మండల ఉపాధ్యక్షుడు కొండా రామిరెడ్డి భార్య కొండా చెన్నమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ బి. కోడూరులో చెన్నమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె అల్లుడైన మాజీ సర్పంచ్ బసిరెడ్డి దుగ్గిరెడ్డి, రామిరెడ్డిలతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ దావీదు, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదులతో ఎమ్మెల్యే వరద సమావేశం



న్యాయవాదులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక బార్‌అసోసియేషన్ కార్యాలయంలోని న్యాయవాదులతో సోమవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమావేశమయ్యారు. అసంపూర్ణంగా ఉన్న కోర్టు భవనాల గురించి న్యాయవాదులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. భవనాల నిర్మాణాలకు అవసరమైన నిధులను ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేయిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శనరెడ్డి, కార్యదర్శి గుర్రప్ప, సీనియర్ న్యాయవాదులు ఈవీ సుధాకర్ రెడ్డి, గొర్రెశ్రీనివాసులు, దాదాపీర్, కొండారెడ్డి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు సహకరించాలి



చికెన్ సెంటర్ నిర్వాహకులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణ సుందరీకరణకు వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి కోరారు. సోమవారం సిద్దవటం రోడ్డులోని చికెన్ షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి పక్కనే మాంసం దుకాణాలు ఉండటం వలన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, అలాగే అపరిశుభ్రత, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మాంసం దుకాణాలను వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపుతామని, దుకాణ నిర్వాహకులు సిద్ధంగా ఉండాలని కోరారు. అలాగే ఆయా దుకాణాల వద్ద, డ్రైనేజీలపైన ఉన్న అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయనగర్‌లో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని శుభ్రం చేసుకోవాలని సంబంధిత యజమానులకు సూచించారు.

సకాలంలో పరిష్కరిస్తున్నాం

వివిధ రకాల సమస్యలపై మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను, అర్జీలను సకాలంలో పరిష్కరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. గత వారంలో వివిధ విభాగాలలో మున్సిపాలిటీకి నలుగురు సిబ్బందిని కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తే ప్రభుత్వ అనుమతితో పారిశుద్ధ్య కార్మికులు కొరతను అధికమిస్తామన్నారు.